

సాక్షి
పల్నాడు
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



పర్యాటకుల సందడి
విజయపురిసౌత్: నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల నెలకొంది. లాంచీల ద్వారా రూ.42,000 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 5000 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1122 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటి మట్టం ఆదివారం 588.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మద్యంతర నిరుద్యోగం!

ఎన్నికల ముందు బాబొస్తే అందరికీ జాబొస్తుంది అన్నారు.. వలంటీర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఇతర ఉద్యోగులను కొనసాగిస్తామంటూ.. వేతనం పెంచి మరీ ప్రోత్సహిస్తామంటూ ఊరూరా ఊదరగొట్టారు.. గంపగుత్తగా ఓట్లేయించుకున్నారు. తీరా గెలిచాక వలంటీర్లను నిర్దాక్షిణ్యంగా పక్కనబెట్టిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేడు మద్యం దుకాణాల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల మెడపై కత్తి వేలాడదీసింది. నూతన మద్యం పాలసీ పేరుతో ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేటు పరం చేసి.. అందులో పనిచేస్తున్న చిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. దీంతో జిల్లావ్యాప్తంగా 451 మంది కుటుంబాలతో సహా రోడ్డున పడనున్నారు.

- పాత మద్యం పాలసీ రద్దుతో సిబ్బంది మెడపై కత్తి
- జిల్లాలో 118 దుకాణాలల్లో 451 మంది ఉద్యోగులు తొలగింపు
- ప్రత్యామ్నాయం చూపకుండానే వీధిన పడేస్తున్న ప్రభుత్వం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ మద్యం షాపుల ఉద్యోగులు
- తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

సత్తెనపల్లి: నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి కొందరి ఉద్యోగాలకు కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తామని ప్రకటించడంతో వీరిలో ఆందోళన నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు ప్రభుత్వ మద్యం షాపుల నిర్వహణకు ఉద్యోగులను నియమించింది.

బాబూ...తీయొద్దు మా జాబు



సత్తెనపల్లిలోని వాక్ ఇన్ లిక్కర్ స్టోర్‌లో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు చూపించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్ వాచ్‌మెన్ తదితర ఉద్యోగాల ద్వారా ఒక్కో షాపులో నలుగురి నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండడంతో తమ భవిష్యత్తు ఏంటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధిపై స్పష్టత కరువు...

తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకురానున్న మద్యం పాలసీతో దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. ఈ నేపథ్యంలో వేలంలో దుకాణాలను దక్కించుకునేవారు. పాత సిబ్బందిని అదే వేతనంతో కొనసాగించే పరిస్థితి లేదు. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న వారి స్థానంలో వారి మనుషులని నియమించుకుంటారు. దీంతో ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారంతా ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి ఉంది. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన లేదు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని తమను ఆదుకోవాలని వీరంతా కోరుతున్నారు.

451 మంది భవితవ్యం ప్రశ్నార్థకం

జిల్లాలో మొత్తం 118 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో 84 మంది సూపర్‌వైజర్లు, 237 మంది సేల్స్‌మెన్‌లు, 130 మంది నైట్ వాచ్‌మెన్‌లు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో దుకాణంలో ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్‌లు, ఒక వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. మండల కేంద్రాల్లోని మద్యం షాపుల్లో సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్, ఒక వాచ్‌మెన్ ఉన్నారు. వీరందరినీ గత ప్రభుత్వం నియమించింది. ఐదేళ్లుగా వీరంతా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. నెలకు సూపర్‌వైజర్ కు రూ. 19,700, సేల్స్‌మెన్ కు రూ 16,500, నైట్ వాచ్‌మెన్ కు రూ. 10,900 చొప్పున ఇప్పటి వరకు వేతనం ఇచ్చారు.



ఉద్యోగ భద్రత కల్పించాలి



నేను ఎమ్మెస్సీ పూర్తి చేశాను. ఎలాంటి ఉద్యోగ అవకాశాలు రాక నిరుద్యోగిగా ఉన్నా. గత ప్రభుత్వం మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా అవకాశం కల్పించింది. నెలకు రూ.19,700 వేతనంతో గౌరవంగా జీవనం వెళ్లదీస్తున్నా. నూతన మద్యం పాలసీతో నా ఉద్యోగం ఊడుతుందని ఆందోళనగా ఉంది. నా లాంటి వందలాది కుటుంబాలు ప్రభుత్వ మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆదుకోవాలి.
–సీహెచ్ మోజేష్, సూపర్‌వైజర్, సత్తెనపల్లి

ఉపాధి చూపాలి



నేను ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యనభ్యసిస్తున్నా. గత ప్రభుత్వం మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా అవకాశం కల్పించి నా కుటుంబానికి న్యాయం చేసింది. నెలకు రూ.16,500 వేతనం రూపంలో రావడంతో జీవనం వెళ్లదీస్తున్నా. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో ఒక్కసారిగా రోడ్డున పడనున్నాం. మళ్లీ నిరుద్యోగులుగా మారకుండా ప్రభుత్వం ఉపాధి చూపాలి.
–అంకాళ్ల జయలక్ష్మీనారాయణ, సేల్స్‌మెన్, సత్తెనపల్లి

రోడ్డున పడకుండా చూడాలి



గత ప్రభుత్వం నాకు మద్యం దుకాణం వద్ద నైట్ వాచ్‌మెన్‌గా పని చేసేందుకు అవకాశం కల్పించింది. నెలకు రూ.10,900 వేతనం రూపంలో అందుకున్నాను. దాంతోనే కుటుంబం గడిచేది. ఇప్పుడు ఉన్నపాటుగా ఉద్యోగాలను తొలగిస్తే ఎలా? మా బతుకులు రోడ్డున పడకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చి ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలి.
–చాగంటి కాశిరెడ్డి, నైట్ వాచ్‌మెన్, సత్తెనపల్లి

న్యూస్‌రీల్

రేపు తైక్వాండో జిల్లా జట్ల ఎంపికలు



సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెనాలి చెంచుపేటలోని డీఎస్ఏ స్టేడియంలో అక్టోబర్ 1న తైక్వాండో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని అండర్ -19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు ఆదివారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో 10వ తరగతి మార్కుల జాబితాతో హాజరు కావాలని కోరారు.

3 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తుకు తుది గడువు అక్టోబర్ 3వ తేదీతో ముగియనుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం తెలిపారు. ఆలోగా నమోదు చేసుకున్న విద్యార్థుల ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమయంలో విద్యార్థులు తమ కుల, ఆదాయ ధ్రువపత్రాలు అప్లోడ్ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. విద్యార్థి సంతకంతో ఉన్న పాస్‌పోర్ట్ సైజు ఫొటో అప్లోడ్ చేస్తే సరిపోతుందన్నారు. ఉపకార వేతనాన్ని పొందేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని సూచించారు.

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు దుగ్గిరాలకు చెందిన భక్తుడు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. దుగ్గిరాల బ్రాహ్మణవీధికి చెందిన కె.శివనాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.


గ్రామ పంచాయతీ పరిపాలనపై ముగిసిన శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024-25, పంచాయతీ రాజ్ చట్టంపై గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలకు జెడ్పీ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పంచాయతీ ఆస్తులు, వాటి పరిరక్షణ, ప్రభుత్వ నిబంధనలు, చట్టంలో పొందుపర్చిన అంశాలతో పాటు విధి నిర్వహణలో న్యాయపరమైన అంశాలను రీసోర్స్ పర్సన్ బొంతా సుబ్బారావు వివరించారు. గ్రామ పంచాయతీలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, తీసుకోవాల్సి జాగ్రత్తల వంటి అంశాలపై పి. నాగానంత్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై చేబ్రోలు ఈవో పీఆర్డీ బి. శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వ్యవస్థ, పరిపాలనలో కేంద్ర, ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన పాలసీలు, విధివిధానాలపై సమగ్రంగా వివరించారు.

మల్లేశ్వరుని సన్నిధిలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

పెదకాకాని: తెలిసీతెలియక చేసే పొరపాట్ల వల్ల కలిగిన దోష పరిహారం కోసం చేసే పూజా క్రతువులే పవిత్రోత్సవాలు అని స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు తెలిపారు. శ్రీ మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో మూడు రోజుల పవిత్రోత్సవాలు ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా ఉదయం యాగశాల ప్రవేశం, శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. రెండవరోజు పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్య హోమం, పూర్ణాహుతి, ఉపచారం, మంత్రపుష్పం, హారతి, విబూది, కుంకుమ ప్రసాద పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, దాతలు రెడ్డి నవీన్‌కుమార్ విజయలక్ష్మి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కోయకుండానే కన్నీరు



నిన్న, మొన్నటి వరకూ నూనెల ధరలు చూసి నోరెళ్లబెట్టిన వినియోగదారులకు నేడు ఉల్లి ధరలు భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే కాయగూరల ధరలు ఆకాశాన్నంటగా.. వీటికి తోడు నిత్యావసరంగా ఉన్న ఉల్లి ధరలు అమాంతంగా పెరగడంతో చేతి చమురు వదులుతోందని పేద, మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోయకుండానే ఉల్లి తమకు కన్నీరు తెప్పిస్తోందని మహిళలు ఆక్రందన వెలిబుచ్చుతున్నారు.

ఉల్లి అ'ధర'హో ..!
- కన్నీరు పెట్టిస్తున్న ఉల్లిగడ్డలు
- కొండెక్కిన ధరలతో సామాన్యులు సతమతం
- మూడు నెలలుగా ఏమాత్రం తగ్గని ధరలు
- ధరాభారం తప్పడం లేదంటూ ఆవేదన

సత్తెనపల్లి: జిల్లాలో ఉల్లిగడ్డలు కొనుగోలు చేయకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి. గతంలో బాగా దిగుబడి తక్కువగా ఉన్న సమయంలో పలికిన ధర నేడు జిల్లాలోని మార్కెట్లలో పలుకుతున్నాయి. కూరగాయల మార్కెట్లో మొదటిరకం ఉల్లిగడ్డలు (పాతవి) కిలో రూ. 70 నుంచి రూ.75 వరకు విక్రయం జరుగుతున్నాయి. రెండో రకం ఉల్లిగడ్డలు కిలో రూ.55 నుంచి రూ.65 వరకు విక్రయం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ఉల్లి ధరలు చుక్కలను అంటుతున్నాయి. దిగుబడి తగ్గడంతో ఉల్లి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లిపాయల ఉత్పత్తి ఎక్కువగా ఉండి ఎగుమతులు చేసే మహారాష్ట్రలో దిగుబడులు తగ్గడంతోనే ఉల్లి ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నట్లు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం...

ఉల్లి ధరలు భారీగా పెరగడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రాయితీపై వినియోగదారులకు ఉల్లిపాయలు సరఫరా చేశారు. మార్కెట్లో అధిక ధరలు ఉండడంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉల్లిని కొనుగోలు చేసి వినియోగదారులకు రాయితీపై సరఫరా చేసింది. దీంతో సామాన్య, మధ్యతరగతి, పేద వర్గాల ప్రజలకు అప్పట్లో ఎంతో ప్రయోజనకరంగా ఉంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసరాలు, కూరగాయలు, ఆకు కూరలు, నూనెలు, ఉల్లిపాయలు ఇలా ఒక్కొక్కటి ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పట్టించుకునేవారు, అడిగేవారు లేకపోవడంతో వ్యాపారులు కూడా అదును చూసి ఇష్టం వచ్చినట్లు అమ్మకాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలపై భారం పడకుండా రాయితీపై ఉల్లిగడ్డలు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

మూడు నెలలుగా ఇదే పరిస్థితి...

ఉల్లిగడ్డల దిగుమతులు తక్కువగా ఉండటంతో పాటు మహారాష్ట్ర, కర్నూలు, తదితర ప్రాంతాల నుంచి దిగుమతులు రాకపోవడంతో గత మూడు నెలలుగా ఉల్లి ధరలు తగ్గకుండా పెరుగుతూనే ఉన్నాయి. గత జూన్ లో కిలో రూ. 30 ఉంటే నేడు రూ.70కు చేరుకున్నాయి. ధరలు పెరిగిపోతున్నాయే తప్ప తగ్గడం లేదని కొనుగోలుదారులు, వ్యాపారులు చెబుతున్నారు. జూన్‌కు ముందు పాత ఇనుము, ప్లాస్టిక్ వంటి పాత సామగ్రి కొనుగోలు చేసుకునే వారు కూడా ఉల్లిగడ్డలు తక్కువకు ఇచ్చి పోయేవారు. నేడు వారు కూడా ఉల్లి ధరలు ఎక్కువగా ఉండటంతో ఉల్లిగడ్డలకు బదులు డబ్బులు ఇస్తున్నారు. ఉల్లి దిగుమతులు లేకపోవడంతో ధరలు పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. రెండో రకం నాణ్యత లేక పోవడంతో కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇష్టపడటం లేదని చెబుతున్నారు.

అమరేశ్వరాలయంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

అమరావతి: పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథశర్మ తెలిపారు. ఆదివారం ఆయన కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఆశ్వయుజశుద్ధ పాడ్యమి నుంచి ద్వాదశి వరకు బాలచాముండేశ్వరి, జ్వాలాముఖి అమ్మవార్లకు ప్రతినిత్యం మూడు వేళల సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, లలితా అష్టోత్తరనామార్చన, సప్తశతి పారాయణం, ప్రతిరోజు చండీ హోమం నిర్వహిస్తామని తెలిపారు. దసరా ఉత్సవాలలో ప్రతిరోజూ ప్రత్యేకంగా భక్తులచే చండీ హోమం నిర్వహిస్తున్నామని అలాగే 9వ తేదీ మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి బాలబాలికలకు ఉచితంగా అక్షరాభ్యాసం నిర్వహిస్తామన్నారు. దసరా సందర్భంగా స్వామివారికి చండీ కల్యాణం నిర్వహిస్తున్నామని అందులో భాగంగా 9వ తేదీ అంకురారోపణ, వాస్తుహోమం, పుణ్యాహవాచనం, ధ్వజపటారోహణ నిర్వహిస్తామన్నారు. 11వతేదీ రాత్రి 7 గంటలకు చండీ కల్యాణోత్సవం, 12వతేదీ రాత్రి ఆరు గంటలకు పారువేట, శమీపూజ, అలాగే 14వ తేదీ చూర్ణోత్సవం, వసంతోత్సవం, గ్రామోత్సవం, ధ్వజావరోహణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాలలో నిత్యం నిర్వహించే చండీహోమానికి రూ.3116, అమ్మవారి కుంకుమార్చనకు రూ.516, అమ్మవారి ఉభయ, అలంకరణ సేవకు రూ.3116 చెల్లించి భక్తులు పాల్గొనచ్చని తెలిపారు. నవరాత్రోత్సవాలలో ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత ప్రసాదాలను అందిస్తున్నామన్నారు, గ్రామంలోని కోదండరామస్వామి దేవస్థానం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానాలలో దసరా నవరాత్రోత్సవాలకు అక్టోబరు 3వతేదీ నుంచి 12 వరకు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు, సహస్ర కుంకుమార్చనలు, నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



విశేషాలంకారంలో బాలచాముండేశ్వరిదేవి అమ్మవారు



ఓవర్ లోడుతో మైనింగ్ రాయిని రవాణా చేస్తున్న టిప్పర్

అక్రమ దందా
ఓవర్‌లోడ్

ఓ పక్కన రక్షణ లేకుండా, మరో పక్కన అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా టిప్పర్ల ద్వారా మైనింగ్ రాయి, మట్టిని అక్రమార్కులు తరలిస్తున్నారు. సామర్థ్యానికి మించి టిప్పర్‌లో మైనింగ్ రాళ్లను వేసి ప్రధాన రహదారిపై అతివేగంగా తరలిస్తున్నారు. క్యాబిన్ కంటే ఎత్తుగా రాళ్లను ఓవర్‌లోడ్ చేసి తరలించటం వలన టిప్పరు బ్రేక్ వేసిన సమయంలో రోడ్డంతా రాళ్లు పడిపోవడమే కాకుండా, వెనుక ఉన్న వాహనాలపై పడి ధ్వంసమవుతున్నాయి. అలాగే బైపాస్‌కు ఇరువైపులా ఉన్న పొలాలు, స్థలాల నుంచి మట్టిని తరలిస్తూ కొందరు అక్రమ దందా చేస్తున్నారు. వీరి ఆగడాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. – పిడుగురాళ్ల

డిపాజిట్ల స్వాహా వ్యవహారంలో ఇద్దరు సస్పెన్షన్

రూ.10 లక్షలపైనే గోల్‌మాల్ జరిగినట్లు నిర్ధారణ

నాదెండ్ల: కనపర్రు సబ్ పోస్టాఫీసు పరిధిలో డిపాజిట్ల సొమ్ము స్వాహా వ్యవహారంలో ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు నరసరావుపేట డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. కనపర్రు సబ్ పోస్టాఫీసులో పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న పుల్లగూర చందు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ సయ్యద్ సలీంబాషాలు 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఖాతాదారుల నుంచి వసూలు చేసిన డబ్బులు జమ చేయకుండా దారిమళ్లించడం, ఈ విషయమై శనివారం ఖాతాదారులు ఆందోళన చేసిన విషయం విధితమే. ఖాతాదారుల ఆందోళనతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. శుక్ర, శనివారాల్లో జరిగిన విచారణలో సుమారు రూ.10 లక్షల వరకూ నిధుల గోల్‌మాల్ జరిగినట్లు తేలిందని తెలిపారు. ప్రస్తుతం పక్క గ్రామంలోని పోస్ట్‌మాస్టర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించినట్లు తెలిపారు.

దళిత యువకులపై దాష్టీకం

- గదిలో బంధించి చిత్రహింసలు పెట్టిన అగ్రవర్ణాలకు చెందిన యువకులు
- కులంపేరుతో దూషణ
- రాజుపాలెం మండలం గణపవరంలో ఘటన



నలుగురు దళిత యువకులను గదిలో బంధించినప్పటి దృశ్యం

రాజుపాలెం: కుల అహంకారంతో అగ్రవర్ణాలకు చెందిన వారు నలుగురు దళిత యువకులను గదిలో బంధించి చిత్రహింసలకు గురిచేసిన సంఘటన మండలంలోని గణపవరంలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు... బలిజేపల్లికి చెందిన దళిత యువకులు గడ్డిపర్తి సురేష్, పొరనంది మరియదాసు, గడ్డిపర్తి సాల్మన్, కఠారి లక్ష్మయ్యలు బలిజేపల్లికి సమీపంలోని గణపవరంలో గల మద్యం షాపునకు వచ్చారు. ఆ సమయంలో గణపవరంలోని అగ్రకులానికి చెందిన యువకులు నల్లూరి మోహన్, నల్లూరి శ్రీను, నల్లూరి అశోక్ మద్యం షాపు వద్దనే ఉన్నారు. అదే సమయంలో దళిత యువకులకు అగ్రవర్ణానికి చెందిన యువకులకు మాటా మాటా పెరిగి గొడవ జరిగింది. దీంతో అగ్రవర్ణానికి చెందిన 50 మంది అక్కడకు చేరి ఆ నలుగురి యువకులను చొక్కాలు పట్టుకుని వారి ప్రాంతానికి లాక్కుని పోయి గదిలో బంధించి ఇష్టమొచ్చినట్లు కొట్టి, కులం పేరుతో బండబూతులు తిడుతూ చిత్రహింసలు పెట్టారు. విషయం తెలుసుకున్న దళిత యువకులకు చెందిన మహిళలు అక్కడికి చేరుకుని అగ్రకులస్తులతో ప్రాధేయపడి విడిపించుకునివచ్చారు. వెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. గడ్డిపర్తి సురేష్, పొరనంది మరియదాసుకు తీవ్ర గాయాలు కావడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



దెబ్బలు తగిలిన గడ్డిపర్తి సురేష్



పొరనంది మరియదాసు తల పగిలిన వైనం

క్లుప్తంగా

యువత స్పందన అభినందనీయం



మంగళగిరి: ఏ టూ ఏ రన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని సినీ నటుడు నిఖిల్ పేర్కొన్నారు. గుండె జబ్బులపై అవగాహన, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, అందరి కోసం అమరావతి పేరుతో ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. 3కే, 5కే, 10కే రన్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక్క పిలుపునిస్తే 5 వేల మంది రన్‌లో పాల్గొనడం అభినందనీయం అన్నారు. జీవన శైలిలో మార్పులే వ్యాధులకు కారణమన్నారు. అందరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు యూనివర్సిటీలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలను కట్టడి చేసేందుకే పోలీస్ పెట్రోలింగ్



బాపట్ల టౌన్: నేరాలను కట్టడి చేసేందుకే పోలీసులు రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు, సీఐలు ఆదివారం రాత్రి గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల్ని సమర్థంగా కట్టడి చేసేందుకు పెట్రోలింగ్, గస్తీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రాత్రిళ్లు అనవసరంగా వీధుల్లో తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్తుల కదలికల్ని నిశితంగా గమనిస్తున్నామని, అనుమానితుల్ని తనిఖీ చేసి విచారిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం కల్పిస్తూ నేరాల్ని కట్టడి చేసేందుకు రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్న పోలీస్ గస్తీకి జిల్లా ప్రజలు కూడా సహకరించాలని ఎస్పీ కోరారు. రాత్రులు సంచరిస్తున్న అనుమానితుల్ని విచారించే సమయంలో పోలీసులు అడిగిన వివరాలను తెలపాలని ఆయన సూచించారు. అనుమానిత ప్రాంతాల్ని విస్తృతంగా తనిఖీ చేయాలని, ఏటీఎం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లను తరచూ సందర్శించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇది కదా ఆనందమంటే!

కళ్లలో శుక్లపు పొరలు కంటి చూపునకు అడ్డుపడుతున్నా.. వారి కనుపాపల్లో ఆనందాల జ్యోతులు వెలిగాయి.. ఆ నడకల్లో సత్తువ మందగించినా.. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు 54 ఏళ్లు వెనక్కి నెట్టాయి. వీరితో పాటు ఆ పాఠశాల కొత్త తరం విద్యార్థులు పాలుపంచుకున్నారు. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. ఈ అపూర్వ ఆత్మీయ ఘట్టాలు హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని చిత్రా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి.

- రెంటచింతల పాఠశాల అపూర్వ సమ్మేళనం
- హైదరాబాద్‌లో సందడిగా నిర్వహణ గురువులకు సన్మానం



రెంటచింతల వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు

రెంటచింతల: స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో 1970–71 బ్యాచ్ నుంచి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఉద్యోగాలు చేసి రిటైర్డు అయినా వారు, వ్యాపారంలో స్థిరపడిన వారు హాజరయ్యారు. ఇప్పుడు ఇక్కడ చదివి ఉన్నత



సమ్మేళానికి హాజరైన ఉన్నత పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు

చదువు బాటలో ఉన్న యువతరం కూడా ఇక్కడకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఉన్నత పాఠశాలలో గురువులు నేర్పిన విద్యే తాము ఇంతటి ఉన్నతకి కారణమని పలువురు విద్యార్థులు పేర్కొన్న సమయంలో కరతాళ ధ్వనులతో ఫంక్షన్ హాల్ మార్మోగింది. తొలుత పూర్వ విద్యార్థుల కలయికకు కారణమైన గుంటక అమరనాథ్‌రెడ్డి, ఆదినారాయణలను ప్రత్యేకంగా అభినందించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులైన ఆంజనేయ రెడ్డి, బొడ్డుపల్లి ప్రసాద్, పెద్దిరెడ్డి సైదారెడ్డి, గోగిరెడ్డి సీతారెడ్డి, పున్నమ్మ, నోటు కొండారెడ్డి, పల్లెర్ల లక్ష్మారెడ్డి, డాక్టర్ కేశవ శాస్త్రి, ప్రస్తుత కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, హెచ్ఎం కొత్తా చంద్రం, బద్దిగం ఈశ్వర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు.

అపూర్వ సమ్మేళనం..



నాతో 1962లో కలసి చదువుకున్న మిత్రులను.. అలాగే నాతో కలిసి బోధన చేసిన ఉపాధ్యాయులను కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మేము నేర్పిన నైతిక విలువలతో కూడిన విద్య కారణంగానే ఉన్నత స్థాయికి చేరుకున్న మా విద్యార్థులను చూడటం ఎంతో ఆనందంగా ఉంది.

–పెద్దిరెడ్డి సైదారెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయులు, రెంటచింతల

వారు నేర్పిన విద్యతోనే...



ఆనాడు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో నేర్పిన విద్యాబుద్ధులతోనే ఆంధ్రా బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి రిటైర్డు అయ్యాను. 1973–74లో పదో తరగతి చదువుకున్నా.. ఎన్నో ఏళ్ల తరువాత స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా ఉపాధ్యాయులను సన్మానించుకోవడం పూర్వజన్మ సుకృతం.

–మోదుగుల సత్యనారాయణరెడ్డి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్, రెంటచింతల

ఆశీస్సులు పొందటం అదృష్టం...



క్రమశిక్షణ.. విలువలతో కూడిన విద్యాదానం చేసిన గురువుల ఆశీస్సులను 53 ఏళ్ల అనంతరం పొందడం అదృష్టంగా భావిస్తున్నా.. కలిసి చదువుకున్న పూర్వ మిత్రులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఆనాటి గురువులు అందించిన జ్ఞానంతోనే దేవస్థానం చైర్మన్‌గా దైవ సేవాకార్యక్రమాలను చేస్తున్నా.

– నాళం పెదబాబు, వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్, రెంటచింతల

కోటి విత్తన బంతులు తయారీ లక్ష్యం

కారెంపూడి: భారత దేశానికి స్వాతంత్య్రాన్ని సముపార్జించిన మహాత్మాగాంధీ జయంతి నాటికి కోటి విత్తన బంతులు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా మహాత్మునికి నిజమైన నివాళి అవుతుందని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కారెంపూడి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదు వేల విత్తన బంతులు తయారు చేసి ఇచ్చారని అలాగే ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులు, సేవా సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా



విత్తన బంతులు తయారు చేసిన విద్యార్థులతో వాసవి క్లబ్ ప్రతినిధులు

పెట్టుకున్నామని తెలిపారు. ఈ విత్తన బంతులను చిట్టడవులు, ఇతర అటవీ ప్రాంతాలలో చల్లుతామని పేర్కొన్నారు. వీటితో పాటు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

నేటి నుంచి అందుబాటులో ఉచిత ఇసుక

గుంటూరు వెస్ట్: గృహ వినియోగాల కోసం సోమవారం నుంచి ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలన్నారు. సొంత వాహనం కలిగిన వారికి ఇసుక ఇస్తామన్నారు. ఇసుక లభ్యమయ్యే పాయింట్ నుంచి తెచ్చుకోవాలన్నారు. మిగతావారికి ప్రభుత్వం వాహనాలు సమకూరుస్తుందని, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వారే చెల్లించుకోవాలన్నారు.

పరిహారం అందకపోతే ఫిర్యాదు చేయండి

ఇటీవల భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారికి ఇప్పటికే ఎన్యుమరేషన్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన నష్టపరిహారం ఈ నెల 25 నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. ఎన్యుమరేషన్‌పై సందేహాలు, ఫిర్యాదులు సోమవారం నుంచి శుక్రవారం వరకు అందజేయవచ్చని తెలిపారు. గుంటూరు కలెక్టరేట్, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం, గుంటూరు ఆర్డీఓ కార్యాలయాలతో పాటు అందుబాటులో ఉన్న తహసీల్దార్ ఆఫీసుల్లో అందజేయాలని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా జేఎన్‌టీయూఎన్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థుల డాన్స్

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సినీ పాటలకు నృత్యాలు చేస్తున్న సమయంలో కేరింతలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులను తెలుసుకునేందుకు, తరగతి గది వెలుపల సహచర విద్యార్థులతో బంధం ఏర్పడేందుకు కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు. కేవలం చదువులోనే కాకుండా అన్ని అంశాలల్లో చురుగ్గా పాల్గొనాలని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ జీపీ రాజు, డాక్టర్ కె.విమల్‌కుమార్, డాక్టర్ ఎ.గంగాధర్, డాక్టర్ ఐ.ఫణిసుష్మ, సురేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పొన్నూరు: పట్టణంలోని బాపట్ల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈతేరు గ్రామం నుంచి పొన్నూరుకు వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న తెనాలి మండలం సంగంజాగర్లమూడికి చెందిన జిలపేగుల రాజేష్ బాబు (30) ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.


చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నాదెండ్ల: చోరీ కేసులో నిందితుడిని యడ్లపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపిన వివరాలు.. ఈ ఏడాది జూలై 23న యడ్లపాడులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నివసించే దేరంగుల దేవి నివాసంలో చోరీ జరిగింది. 40 గ్రాముల బంగారం వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు రఘునాథం కిరణ్ చోరీ చేసిన వస్తువులను ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టి నగదు తీసుకున్నాడు. పోలీసులు దర్యాప్తులో తేలటంతో నిందితుడిని అరెస్టు చేసి చోరీకి గురైన వస్తువులను స్వాధీనపరచుకున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు స్కూల్ టీచర్ మృతి

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు స్కూల్ టీచర్ మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో నివాసండే దోపర్లపూడి నార్ల అప్పారావు(32) ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అప్పారావు గత రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా నరసరావుపేట రోడ్డులోని డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. బైక్‌కు ఆవు అడ్డురావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య మాణిక్యం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతి ఘటనపై అర్బన్ సీఐ శోభన్‌బాబు కేసు నమోదు చేశారు.

సినీ నటుడు కోన గోవిందరావు మృతి



బాపట్ల: సినీ నటుడు, నాటక రచయిత, దర్శకులు, వ్యాయామ ఉపాధ్యాయులు కోన గోవిందరావు(80) హైదరాబాద్‌లో మృతి చెందారు. మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు పెద్ద కుమారుడు, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సోదరుడైన గోవిందరావు కళారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మృతి కోన కుటుంబానికి తీరని లోటుగా పలువురు సంతాపం తెలిపారు. అక్షింతలు, రూల్స్ ఒప్పుకోవు, రాజీనామా వంటి ఉత్తమ నాటకాలు గోవిందరావు రచించారు. ఆయన మృతి పట్ల రావూరి నరసింహవర్మ, ఆదా షఫీ, మాల్యాద్రిరావు, కస్తూరి శ్రీనివాసరావు, కామరాజుగడ్డ శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

ముగిసిన టైప్ రైటింగ్ పరీక్షలు

రేపల్లె రూరల్: ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, మంగళగిరి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న టైప్ రైటింగ్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్ హయ్యర్ గ్రేడ్ తెలుగు హయ్యర్ గ్రేడ్‌లకు రెండో రోజు 41 మందికి గానూ 38 మంది హాజరయ్యారని తెలిపారు. మొదటి రోజు 37 మందికి గాను 31 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

సీపీఎం నేత ఏచూరి చిరస్మరణీయుడు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట ఈస్ట్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిరస్మరణీయుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గఫూర్ మాట్లాడుతూ ఏచూరి లేని లోటు దేశ రాజకీయాలకు, కమ్యూనిస్ట్ ఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్మిక, కర్షక సమస్యల మీద నిరంతరం పోరాటం చేశారని వివరించారు. రాజ్యసభకు రెండుమార్లు ప్రాతినిధ్యం వహించారని ఆయన సలహాలు, సూచనలు అధికారపక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు కూడా హుందాగా స్వీకరించేవారని వివరించారు. యూపీఏ పాలనలో ప్రజలకు, కార్మికులకు, విద్యార్థులకు ఉపయోగపడే చట్టాలు తీసుకొచ్చేందుకు కృషి చేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి దేశరాజకీయాల్లో తనదైన ముద్రవేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, నాయకులు కాసా రాంబాబు, గద్దె చలమయ్య, ఏవీకే దుర్గారావు పాల్గొన్నారు.

దసరాకు పీఆర్సీ, డీఏ ప్రకటించాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు దసరాకు నూతన పీఆర్సీతోపాటు డీఏను ప్రకటించాలని ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడిపేటలోని యూటీఎఫ్ హాల్లో సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలను బట్టి జేఏసీ భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, ఇతర బకాయిల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని అన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు, పీఎఫ్ సాధన, పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం నాలుగు దశల్లో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన క్యాదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఈవో–1 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం పెరిగిపోయిందని, దీని ప్రభావం బోధనపై పడుతోందని, తక్షణమే ఆయా యాప్‌లను రద్దు పర్చాలన్నారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంటులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎం.గోవిందయ్య, టి. ఆంజనేయులు, యు.రాజశేఖర్ రావు, జీవీ ధనలక్ష్మి, కె.కేదార్నాథ్, ఎ.శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్, కె.ప్రభూజీ, జి.జితేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

ఏఎన్‌యూ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ చాన్సలర్, తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదివారం తెలిపారు. 'పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తీస్ విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్: రిఫ్లెక్షన్స్ ఆన్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషన్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా' అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ప్రారంభోత్సవానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, ధూళిపాళ్ళ నరేంద్ర, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగ విశ్రాంత ఆచార్యుడు అశోక్ ఓరా కీలకోపన్యాసం చేస్తారు. పలు వర్సిటీలు, తాత్విక సంస్థల నుంచి 40 వరకు పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారని సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు తెలిపారు. ప్రారంభోత్సవ సభ ఉదయం 10.30 గంటలకు మొదలవుతుందన్నారు.

వర్గీకరణ పేరుతో విడదీయటం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్

తెనాలి: ఐకమత్యంగా మెలుగుతున్న మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయడం అన్యాయమని మాలమహానాడు జేఏసీ నేత, హైకోర్టు న్యాయవాది బి.శశిభూషణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, తెనాలి డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అయితానగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్లో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పిల్లి విద్యాసాగర్, గెడ్డటి సుందర్ సునీల్ అధ్యక్షత వహించారు. శశిభూషణ్ మాట్లాడుతూ.. వర్గీకరణ అంశం రాజ్యాంగపరంగా సాధ్యమా? కాదా? అనే అంశంపై ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదుల మధ్య సమగ్ర చర్చ జరగాల్సి ఉందన్నారు. తద్వారా ప్రజలు సుప్రీంకోర్టు తీర్పును అర్థం చేసుకుని తమ హక్కులను కాపాడుకునేందుకు చైతన్యవంతులు కాగలరని అన్నారు. వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషను రూపంలో పెండింగులో ఉందని, అక్టోబరు నెలలో విచారణకు వచ్చే అవకాశం ఉందన్నారు. జేఏసీ నాయకులు కారుమంచి రవికుమార్, పంతగాని రమేష్, దాసరి చెన్నకేశవులు, పొందుగల చైతన్య తమ ప్రసంగాల్లో కుట్రపూరిత రాజకీయాలతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలను వర్గీకరణ చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సిం వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బండికళ్ల బుల్లయ్య, బొనిగల ప్రదీప్, కంచర్ల కోటేశ్వరరావు, అక్కిదాసు కిరణ్ కుమార్, కనపర్తి అబ్రహంలింకన్, కారుమంచి సునీల్ సందీప్, గోవతోటి మనోజ్, యంద్రపాటి అశోక్ కుమార్, వేము సమత, కారుమంచి బానుప్రకాశ్, కంచర్ల అజయ్ కుమార్, మధిర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఔషధాల వినియోగం తగదు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ బాలాజీ వీరరాఘవన్

గుంటూరు మెడికల్: ప్రజల ఆరోగ్యం నేడు ప్రమాదంలో పడిందని, యాంటీ బయాటిక్స్ అడ్డగోలు వాడకమే దీనికి కారణమని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రజల ప్రాణాలకు ప్రమాదమని తెలిపారు. పరిశోధన చేసిన పలువురు వైద్యులు గుంటూరులో జరిగిన సీఎంఈలో ఈ వివరాలు వెల్లడించారు. ఆదివారం గుంటూరులో అసోసియేషన్ ఆఫ్ సెప్సిస్ అండ్ క్రిటికల్ కేర్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ అండ్ ఇన్‌ఫెక్టియస్‌పై జోనల్ నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాయవెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అండ్ సర్వేలెన్స్ డివిజన్‌కు చెందిన డాక్టర్ బాలాజీ వీరరాఘవన్ మీడియాతో మాట్లాడారు. నేడు ఇన్‌ఫెక్షన్ చాలా తీవ్రంగా ఉందని, కరోనా మరణాల కంటే ఇవే అధికమని ఆందోళన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి వినియోగం అధికంగా ఉందన్నారు. ఇన్‌ఫెక్షన్స్‌లకు చికిత్సపై గుంటూరు హెల్ప్ హాస్పిటల్స్‌కు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తితో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది తమ అసోసియేషన్‌ను అధికారికంగా ప్రకటిస్తామన్నారు. కోళ్ల బరువు పెంచేందుకూ యాంటీ బయాటిక్స్ మందులు వాడుతున్నారని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. కోళ్ల దాణాను చౌకగా వస్తుందని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారని, అందులోనూ యాంటీ బయాటిక్స్ ఉన్నట్లు తెలిపారు. చికెన్ ఫీడ్‌లో 90 శాతం ఇలా ఉంటే, ఆక్వాలో 10 శాతం వాడుతున్నట్లు వెల్లడించారు. జోనల్ సీఎంఈ కన్వీనర్ డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. చిన్న అనారోగ్యానికి యాంటీ బయాటిక్స్ వాడటం మానేస్తేనే మంచిదన్నారు. ముంబైకి చెందిన డాక్టర్ వసంత్, చెన్నైకు చెందిన డాక్టర్ సురేష్, డాక్టర్ దేదీప్యం, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గన్‌శ్యామ్, డాక్టర్ విశ్వేశ్వరన్, విశాఖపట్నానికి చెందిన డాక్టర్ మోహన్‌మహరాజీలు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీఎంఈ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.శిల్పా చౌదరి, డాక్టర్ కె. రామకృష్ణప్రసాద్, డాక్టర్ నీరస్ రావెల, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ బాలినేని సాయికృష్ణ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ చంద్రరాధికారాణి, మాజీ సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఏపీ మెడికల్ అబ్జర్వర్ డాక్టర్ గాదె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.